క్లుప్తంగా

సరిహద్దుల్లో చెక్ పోస్టుల ఏర్పాటు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న అటవీ శాఖ చెక్ పోస్ట్‌తో పాటు పట్టణానికి అనుకుని ఉన్న రాష్ట్ర సరిహద్దులో అదనంగా మరో మూడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని సీఐ సంజీవ రావు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకోడ్ నేపథ్యంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నమని, ఎన్నికల కోడ్ నిబంధనలు ప్రతిఒక్కరు తప్పకుండా పాటించాలని సూచించారు. ఆయన వెంట టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రానికి బ్రేక్

అశ్వారావుపేటరూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన సేవా కేంద్రాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఎంపీడీఓ జి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్ కారణంగా ప్రజాపాలన సేవా కేంద్రాన్ని నిలిపివేశామని, దరఖాస్తులు అందించేందుకు ఎన్నికల కోడ్ ముగిసే వరకు రావొద్దని కోరారు.

బాధ్యతలు స్వీకరణ

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా చర్ల ఎంపీడీఓ కె.ఈదయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించే చంద్రశేఖర్ ఫారిన్ సర్వీస్ ఖమ్మంలోని సైనిక్ వేల్ఫేర్‌కు వెళ్లడంతో జిల్లా అధికారులు చర్ల ఎంపీడీఓకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓను ఎంపీఓ ముత్యాలరావు, సూపరింటెండెంట్ సునంద్, ఏపీఓ సుకన్య, సాయిబాబు, శ్రావణిలు కలిసి అభినందనలు తెలియజేశారు.

దుస్తుల పంపిణీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం రాయన్నపేట గ్రామానికి చెందిన వలస గొత్తికోయల కుటుంబాలకు, యువకులకు సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఓసీ–2 ఎలక్ట్రిషియన్ డి.వెంకటేశ్వర్లు వారి తాత దాసరి లక్ష్మయ్య జ్ఞాపకార్థం సోమవారం దుస్తులు, భోజనం ప్యాకెట్లు అందజేశారు. కేసీహెచ్‌పీ ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ పీకా శంకర్, పి.మంగయ్య, సింగరేణి సేవా సమితి సభ్యులు మంగీలాల్, గ్రామస్తులు భీమయ్య, కుంజా రమేష్, కుమార్, శంకర్, శివ, దేవేందర్, శ్రీను, లక్ష్మి, చుక్కమ్మ పాల్గొన్నారు.

ఉచిత దర్శనం అభినందనీయం

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని సీతారామ చంద్ర స్వామివారి దేవస్థానంలో స్థానికులకు స్వామివారి ఉచిత దర్శన నిర్ణయం హర్షనీయమని టీటీడీపీ మహబూబాబాద్ పార్లమెట్ నియోజకవర్గ కార్యదర్శి షేక్ అజీమ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. భద్రాద్రి ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసం ఈఓ రమాదేవి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.

స్థలం తిరిగి ఇవ్వాలి

గుండాల: మండల కేంద్రంలో ఆక్రమణకు గురైన లక్ష్మీదేవత పేరుతో ఉన్న స్థలాన్ని తమకు అప్పగించాలని ఆ వంశస్తులు డిమాండ్ చేశారు. సోమవారం నాయకపోడు కులస్తుల ఆధ్వర్యంలో లక్ష్మీదేవర రాయి పాపయ్యగా పిలువబడే భూమిని అప్పగించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. తాతముత్తాతల కాలం నుంచి తమ వంశీయులు పండుగను జరిపే వారని తెలిపారు. కాలక్రమేన కొన్ని సంవత్సరాలుగా ఆ పండుగ చేయడం లేదన్నారు. దీంతో ఆస్పత్రి వద్ద దేవుని పేర ఉన్న 8 గుంటల స్థలం ఆక్రమకు గురైందని, దానిని ఇప్పించగలరని కోరారు. చేబోతు రంజీత్, గోవింద నర్సింహారావు, రవి, రాజు, దేవేందర్, శోభన్ బాబు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

బూర్గంపాడు: అంజనాపురం గ్రామానికి చెందిన మోరంపల్లిబంజర గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ తేజావత్ సూర్యం(90) సోమవారం మృతిచెందారు. మోరంపల్లిబంజర పంచాయతీకి ఐదు పర్యాయాలు ఆయన సర్పంచ్‌గా ఎన్నికై ప్రజలకు సేవలను అందించారు. మౌలిక వసతుల కల్పనకు ఆయన విశేషంగా కృషి చేశారు. మృతిపట్ల పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

వీరభద్రుడికి రుద్రాభిషేకం

చర్లరూరల్: చర్ల మండలంలోని తేగడ గ్రామం భద్రకాళి సమేత వీరభద్రస్వామికి సోమవారం ఆలయ అర్చకులు యల్లమందల భానుప్రకాష్ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజ, మహాశాంతి రుద్రహోమం నిర్వహించారు.

వేలం పాట వాయిదా

అశ్వారావుపేట: అశ్వారావుపేట మేజర్ పంచాయతీలో నేడు(మంగళవారం) జరుగున్న వారపుసంత, ఇతర వేలం పాటలు వాయిదా పడినట్లు ఈఓ హరికృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలం నిర్వహణ తేదీలను తుదపరి వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

అందని ద్రాక్షగా పశువైద్యం

- కొరవడిన వసతులు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- సకాలంలో అందని వైద్యసేవలు


దేవరనాగారంలో ఆవుకు వైద్యం చేస్తున్న సబార్డినేట్ సోందుమియా

కరకగూడెం: ప్రభుత్వాలు మారుతున్నా మండలంలోని పశు వైద్యశాల పరిస్థితి ఏమాత్రం మారడం లేదు. ఏజెన్సీ ప్రాంతంలో వ్యవసాయం తరువాత రైతులకు వెన్నుదన్నుగా ఉండే పాడి పోషణపై నీలినీడలు కమ్ముకున్నాయి. మండలంలో మూగ జీవాలకు పశువైద్యం అందనిద్రాక్షలా తయారైంది. పశువైద్యశాలల్లో సిబ్బంది కొరతతోపాటు సరిపడా వసతులు లేక పశువులకు సరైన వైద్యం అందడంలేదనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి.16 గ్రామ పంచాయతీలకు మండల కేంద్రంలో ఒకే ఒక పశు వైద్యశాల ఉండగా 2018వ సంవత్సరం నుంచి నేటి వరకు ఇక్కడ పూర్తిస్థాయిలో పశువైద్యాధికారి లేడు. దీంతో పశువులకు సకాలంలో వైద్యం చేయించుకోలేక పోతున్నామని పాడి రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పినపాక మండల పశు వైద్యాధికారి ఇక్కడ ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ప్రతీ రోజు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడం,పశువుల సంరక్షణలో తీసుకోవాల్సిన తదితర జాగ్రత్తలను అధికారుల నుండి పొందడం లేదని పలువురు రైతులు పెదవివిరుస్తున్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

పాడి, గొల్ల కురుమల అభివృద్ధి కోసం గత రాష్ట్ర ప్రభుత్వం పాటుపడి సబ్సిడీపై జీవాలను అందించింది. కానీ గతంలో కొన్ని గ్రామాల్లో వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడిన సంఘటనలు లేకపోలేదు.పశు వైద్యశాలలో సిబ్బంది కొరత కారణంగా జీవాలకు వైద్య సేవలు అందడంలో ఆలస్యం అవుతోంది. తద్వారా పశుపోషణపై ఆధారపడిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జీవాలకు జబ్బు చేస్తే నయం చేసేందుకు డాక్టర్ వచ్చి సలహాలు సూచనలు ఇచ్చి వైద్యం అందించాల్సి ఉంది. ఈ మేరకు గత పాలకులకు మొర పెట్టుకున్న లాభంలేకుండపోయిందని పాడి రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సబార్డినేటే అన్నీ..

పశువైద్యాధికారి లేకపోవడంతో ఆస్పత్రి నిర్వహణ సబార్డినేటే చూసుకుంటున్నాడు. మండల పశువైద్యశాలలోని సబార్డినేట్ షేక్ సోందుమియా ఆస్పత్రిలోనే నివాసం ఉంటూ వైద్యం అందిస్తున్నాడు. గ్రామస్తుల పిలుపు మేరకు సబార్డినేటే గ్రామాల్లోకి వెళ్లి మూగజీవాలకు వైద్యం అందిస్తున్నాడు.

నాటు వైద్యమే దిక్కు

స్థానికంగా పశువైద్యుడు లేకపోవడంతో పలువురు స్థానికంగా నాటు వైద్యాన్ని సంప్రదిస్తున్నారు. మరికొందరు ప్రవేట్ వెట్నరీ మెడికల్ దుకాణాల ద్వారా మందులను కొనితెచ్చుకుని సొంతంగా వైద్యం చేసుకుంటున్నారు. అయితే వేసవికాల నేపథ్యంలో మూగా జీవాలు వేడి నీళ్లు తాగి రోగాల బారిన పడే అవకాశం ఉన్నందున జీవాలకు సీజనల్ రోగాలు రాకుండా టీకాలు వేయాల్సిన ఉంది. ఈ నేపథ్యంలో వైద్యుడు అందుబాటులో లేకపోవడం తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశముంది. కాగా, ఈ విషయంపై జిల్లా పశు వైద్యశాఖ అధికారి బి.పురందర్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిత్యం రైతులకు అందుబాటులో ఉండేలా సిబ్బందికి సూచిస్తున్నామని తెలిపారు.

వైద్యాధికారిని నియమించాలి



మండలానికి పూర్తిస్థాయిలో పశు వైద్యాధికారి లేకపోవడంతో పాడి రైతులమైన మేము తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే పూర్తి స్థాయిలో వైద్యాధికారిని నియమించి సీజనల్ వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పించాలి. ఎప్పటికప్పుడు జీవాలకు రోగాలు సంభవించకుండా టీకాలు వేయాలి.

– కటకం సంతోష్, రైతు, కరకగూడెం

చర్యలు తీసుకోవాలి



మండలంలో పశువులను నమ్ముకొని చాలా మంది పాడి రైతులు ఉన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. నిత్యం రైతులకు అందుబాటులో ఉండేలా సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచించారు. తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ మూగజీవాల సంరక్షణకు చర్యలు చేపట్టాలి.

– దాట్ల ప్రమీల, దేవరనాగారం

ప్రైవేట్ వ్యక్తులే ఆధారం



మూగ జీవాలకు వచ్చే రోగాలకు వైద్యం కొరకు చాలా మంది రైతులం ప్రవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్నాం. బయటి నుంచి మందులను కొనితెచ్చుకుని వైద్యం చేసుకుంటూ జీవాలను బతికించుకుంటున్నాం. మరికొంత మంది నాటు వైద్యాన్ని కూడా నమ్ముకుంటున్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లోకి వచ్చేలా అధికారులు, పాలకులు చూడాలి.

– తోలెం నాగేష్, పద్మాపురం

అధికారుల ముమ్మర తనిఖీలు


బయ్యారం క్రాస్ రోడ్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

పినపాక: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున బయ్యారం క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద సోమవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. తహసీల్దార్ సూర్యనారాయణ, ఆధ్వర్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల వాహనాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మణరావు, ఆర్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న కోటి తలంబ్రాలు


కొత్తూరు రామాలయంలో గోటితో తలంబ్రాలను సిద్ధం చేస్తున్న మహిళలు

అశ్వారావుపేటరూరల్: ఈ నెల 25వ తేదీన భద్రాద్రి రాములోరి కల్యాణానికి కోటి తలంబ్రాలను అందించేందుకు పలువురు మహిళా భక్తులు సిద్ధం చేస్తున్నారు. మండలంలోని గుమ్మడవల్లి పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన మహిళా భక్తులు స్థానిక రామాలయం ఆవరణలో ధాన్యాన్ని గోటితో వలుస్తున్నారు. గడిచిన నెల రోజులుగా ప్రతి రోజు సాయంత్రం సమయంలో సుమారు 15 మంది మహిళా భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో తలంబ్రాలను సిద్ధం చేస్తుండగా, కల్యాణం నాటికి కోటి తలంబ్రాలను అందించేలా సంకల్పించారు.

హోమియో వైద్య శిబిరం


చర్లరూరల్: కందిపాడులో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చర్లరూరల్: మండలంలోని కందిపాడులో సోమవారం హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించారు. మలేరియా జ్వరాలతో బాధపడుతున్న వారికి హోమియోపతి వైద్యురాలు పూజ వైద్యం అందిచారు. ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అటవీ ప్రాంత గ్రామాల నుంచి చర్ల మండలానికి వస్తున్న వారిలో మలేరియా లక్షణాలు కనబడుతున్నాయని, స్థానిక ప్రజలు ఆయా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామంలో రక్తనమూనాలను సేకరించి వారికి చికిత్స అందించారు. అనంతరం రాళ్ళగూడెం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరుశుభ్రంగా చూసుకోవాలని కోరారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు.

బాలుర వసతి గృహంలో..

మణుగూరురూరల్: మండలంలోని రాజీవ్‌గాంధీనగర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ వెల్ఫేర్ బాలుర వసతి గృహంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి దగ్గు, జలుబు, జ్వరం వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి శివకుమార్ ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు సూచించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. దోమల నివారణకు, పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలని వసతిగృహ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో రవి, భవాని తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మరమ్మతు పనులు


మరమ్మతు పనులు చేయిస్తున్న తహసీల్దార్ నాగప్రసాద్

సాక్షి ఎఫెక్ట్..

కరకగూడెం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పెచ్చులూడిపోతుండడంతో కార్యాలయ సిబ్బంది, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేస్తూ సోమవారం 'సాక్షి'లో 'శిథిలావస్థలో తహసీల్ భవనం'అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందిస్తూ.. భవనం మరమ్మతుకు చర్యలు ప్రారంభించారు. కరకగూడెం తహసీల్దార్ నాగప్రసాద్ తహసీల్‌లో పెచ్చులూడుతున్న కార్యాలయ ప్రదేశాల్లో ప్లాస్టింగ్ చేయించారు. నూతన భవనం ఏర్పాటు అయ్యేదాక మరమ్మతులు చేయిస్తానని పేర్కొన్నారు.

రైతు వేదికలో నేడు వీడియో కాన్ఫరెన్స్

ములకలపల్లి: రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా నేడు వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారిణి (ఎంఏఓ) కరుణామయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరిలో ప్రస్తుతం పాటించవలసిన మెళకువలు, ఆయిల్‌పాం సాగు, వేసవి కూరగాయల సస్యరక్షణ, మందుల వాడకం అంశాలపై సంబంధిత శాస్త్రవేత్తలతో సూచనలు, సలహాలతో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ములకలపల్లి రైతువేదికలో ఉదయం 10 గంటల నుండి 11.30 వరకూ ప్రసారం కొనసాగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఏఓ తెలిపారు.

సేంద్రియ పద్ధతిలో సాగు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయతీలోని బీజీ కొత్తూరు గ్రామానికి చెందిన యువ రైతు మర్రి శ్రీనివాసరెడ్డి సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. శ్రీనివాసరెడ్డి సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నాడు. ఆవుల ఎరువు, మూత్రం, కొమ్ముల లోపలి నుంచి తీసిన పదార్థం ఐన బీడీ 500 వంటి సేంద్రియ పదార్థాలతో సాగు చేస్తున్నాడు. సేంద్రియ ఎరువులు, మట్టి ద్రావణాలతో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తూ ఆరోగ్యకరమైన కూరగాయలు పండిస్తున్నాడు. బెండకాయలు, టమాట, బీరకాయ, దోస, తోటకూర, పాలకూర వంటివి సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం రసాయనిక పురుగుమందులు, ఎరువులతో సాగు చేస్తున్న పరిస్థితుల్లో శ్రీనివాసరెడ్డి సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ ఆరోగ్య కరమైన కూరగాయలు పండిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాడు.

కార్పొరేషన్ చైర్మన్ పదవిపై హర్షం

దుమ్ముగూడెం: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడం శుభపరిణామం అని భద్రాచలం నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లంకా శివకుమార్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోడి చంటిబాబులు అన్నారు. సోమవారం పొదెం వీరయ్యకు కార్పొరేషన్ చైర్మన్ పది రావడంపై కార్యకర్తలు కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు, పిలక వెంకటరమణరెడ్డి, తెల్లం హరికృష్ణ, తెల్లం నరేష్, వర్సా చిన్నారావు, కంగాల వెంకటేష్, కట్టం కృష్ణ, సరియం వీర్రాజు పాల్గొన్నారు.

దళితులకు ప్రాధాన్యత ఇవ్వాలి

భద్రాచలంటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలు దళితులకు రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పౌల్‌రాజ్ అన్నారు. స్థానిక ఎంపీ కాలనీలో సోమవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోనే మెజార్టీ ఉన్న దళితులను పార్టీలలో ప్రాధాన్యత ఇవ్వకుండా చిన్న చూపు చూస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో కనకరాజు, శ్రీను, మంజువాణి, జయమ్మ, సుహాసిని, రాణి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


కరకగూడెం: ప్రతిజ్ఞ చేస్తున్న సీడీపీఓ, బాలింతలు, చిన్నారులు

దుమ్ముగూడెం: గర్భిణులు, తల్లులు బలమైన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ నవ్యశ్రీ, ములకపాడు డాక్టర్ పుల్లారెడ్డిలు సూచించారు. సోమవారం పోషణపక్వాడా కార్యక్రమంలో భాగంగా ఆర్లగూడెం సెంటర్‌లో లెవల్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహార నియమాలు జాగ్రత్తలను వివరించారు. అనంతరం సామూహిక సీమంతాలు, అక్షరభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైపర్‌వైజర్ ధనలక్ష్మి, పోషణ అభియాన్ మౌనిక, లక్ష్మీదేవి, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామంలోని లబ్ధిదారులు పాల్గొన్నారు.

ములకలపల్లి: పోషణ్‌పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. మొటుగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమణి పాల్గొని మాట్లాడారు. పోషకాహార అవశ్యకతను వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు కరుణ, రాములమ్మ, వరలక్ష్మి, అరుణ, ఉపాధ్యాయులు ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని మణుగూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ జయలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం కరకగూడెం సెక్టార్ పరిధిలో వలస ఆదివాసీ గ్రామమైన మాధన్నగుడెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహణ కల్పించారు. ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు భద్రమ్మ, పద్మ అంగన్‌వాడీ టీచర్లు సత్యవతి, విజయకుమారి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి


బయ్యారం పంచాయతీలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సూర్యనారాయణ

పినపాక: పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ రామకృష్ణతో కలిసి మండలంలోని పోలింగ్ పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, విద్యుత్, నీరు, మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, వీల్ చైర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలకృష్ణ, బయ్యారం సెక్రటరీ జైపాల్ రెడ్డి, బీఎల్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షలు షురూ..

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. అన్ని ప్రాంతాల్లో ఆయా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకున్నారు. ప్రతీ విద్యార్థిని తనిఖీ చేసిన తరువాతనే సిబ్బంది వారిని లోపలికి పంపించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. పలువురు అధికారులు పరీక్ష కేంద్రాలకు చేరుకుని అక్కడి తీరుతెన్నులను పరిశీలించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. కాగా, ఆయా కేంద్రాల్లో పలువురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

– సాక్షి నెట్‌వర్క్


భద్రాచలంటౌన్: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


మణుగూరుటౌన్: పరీక్ష గదిని చూసుకుంటున్న విద్యార్థులు


ములకలపల్లి: హైస్కూల్ వద్ద విద్యార్థినులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


మణుగూరురూరల్: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాఘవరెడ్డి


దమ్మపేట: పరీక్ష హాలులో కూర్చున్న విద్యార్థులు


అన్నపురెడ్డిపల్లి: హాల్ టికెట్ల పరిశీలన..


దమ్మపేట: పరీక్ష కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు


అశ్వారావుపేటరూరల్: సున్నంబట్టి కేంద్రం వద్ద పర్యవేక్షిస్తున్న పోలీస్ సిబ్బంది


కరకగూడెం: బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు